

వార్తలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, సిబ్బంది

## ఎన్నికల సమాచారాన్ని ఎంసీఎంసీ ద్వారా అందజేయాలి

**అదనపు కలెక్టర్ డీఎస్ వెంకన్న**

ములుగు టౌన్, నవంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ద్వారా అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డీఎస్ వెంకన్న అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రసురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనల వంటి వాటిపై ఎంసీఎంసీ బృందం తక్షణమే స్పందించాలన్నారు. అలాగే లోకల్ కేబుల్ ఛానళ్లలో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేస్తామన్నారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎన్నికల నియమావళిని అతిక్రమించే పోస్టులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్స్, టెలివిజన్ ఛానల్స్, స్థానిక కేబుల్ నెట్ వర్క్‌లు, సోషల్ మీడియా, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందాలని వివరించారు. ఆయన వెంట డీపీఆర్వో యండీ రఫీక్, ఎంసీఎంసీ సిబ్బంది, నాయబ్ తహసీల్దార్ ఎస్ సత్యనారాయ ణ, సీనియర్ అసిస్టెంట్ ఎస్ భవిత, జూనియర్ అసిస్టెంట్లు సురేశ్, శ్రీనివాస్, ఏపీవో ఫిరోజ్ పాషా, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


పోచమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ముక్కిడి పోచమ్మ గుడి వద్ద పూజలు

మంగపేట, నవంబర్ 2 : మండలంలోని కోమటిపల్లి శివారు అటవీ ప్రాంతంలోని ముక్కిడి పోచమ్మ గుడి వద్ద గురువారం సాయంత్రం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శ్రేణులు పూజలు నిర్వహించారు. ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి భారీ మెజార్టీతో గెలుపొందాలని పోచమ్మను వేడుకున్నారు. అనంతరం కోమటిపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లపెల్లి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జీ మార్పుల వెంకటరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చిట్టిమల్ల రజిత సమ్మయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఐక్యతతో పనిచేసి విజయం సాధించాలి

- నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

ఏటూరునాగారం, నవంబర్ 2 : ములుగు నియోజకవర్గంలో ఐక్యతతో పనిచేసి విజయం సాధించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు అన్నారు. సొంత గూటికి చేరిన వెంకటాపురం మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు గురువారం మండల కేంద్రంలోని లక్ష్మీ నర్సింహారావు ఇంటికి రాగా వారిని ఆయన స్వాగతించారు. రోడ్లు భవనాల అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి తదితరులు వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికపై చర్చించారు. అందరూ ఐక్యంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు గట్టి సంకల్పంతో నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని లక్ష్మీ నర్సింహారావు సూచించారు.


వెంకటాపూర్ మండలానికి చెందిన నాయకులతో లక్ష్మీనర్సింహారావు, మెట్టు శ్రీనివాస్, బడే నాగజ్యోతి

**బీఆర్ఎస్‌లో చేరికలు**

మండలంలోని శంకరాజుపల్లి, చెల్పాక గ్రామాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రచారంలో సుమారు వంద మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అభ్యర్థి బడే నాగజ్యోతి, సునీల్‌కుమార్, బోడ శంకర్, ఆత్కూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఏరువ సతీశ్‌రెడ్డి, గోవింద్‌నాయక్

## ఏరువ సతీశ్ రెడ్డి సమక్షంలో బీజేపీ మహిళలు..

ములుగు రూరల్, నవంబర్ 2 : ములుగు జిల్లా కేంద్రానికి చెందిన పలువురు బీజేపీ మహిళా నాయకులు గురువారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు రెడ్‌కో చైర్మన్, మండల ఎన్నికల ఇన్‌చార్జి ఏరువ సతీశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జక్కుల స్వర్ణలత, పోరిక సునీత తదితరులున్నారు.

# ఊరూరా బీఆర్ఎస్ ప్రచార హోరు

- గడపగడపకూ వెళ్తున్న శ్రేణులు
- మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్ల అభ్యర్థన
- నాగజ్యోతిని గెలిపించాలని వినతి

మంగపేట, నవంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం ఊరూరా హోరెత్తుతున్నది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రేణులు గడపగడపకూ వెళ్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధి పెరకుల కుంటలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పండా శ్రీను ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించగా, పార్టీ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడిశ నాగరమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం కొనసాగించారు. బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటేనే అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన పరిపాలన ఉంటుందని, ములుగు ఎమ్మెల్యేగా బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ ధార రాంబాబు, చీమల అశోక్, కొమరం శివాజీ, గట్టిపల్లి అర్జున్, చీమల భూషణం తదితరులు పాల్గొన్నారు.

**నాగజ్యోతికి ప్రజల మద్దతు**

గోవిందరావుపేట : బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ అభ్యర్థి బడే నాగజ్యోతికి ప్రజలు మద్దతు పలుకుతున్నారని బీఆర్ఎస్ మండల నాయకుడు లావుడ్య వాగ అన్నారు. నాగజ్యోతి గెలుపు కోరుతూ గురువారం నాయకులతో కలిసి ముమ్మరంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని తెలుపుతూ, ఇటీవల ప్రకటించిన మ్యానిఫెస్టోను వివరిస్తూ ఇంటింటా ఓట్లను అభ్యర్థించారు. ఏ గ్రామంలోకి వెళ్లినా బీఆర్ఎస్‌కు ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారని, నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇస్తున్నారని వాగ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మంగపేట : పెరకులకుంటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


గోవిందరావుపేట : లక్ష్మీపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న శ్రేణులు

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గోవిందరావుపేట, నవంబర్ 2 : నాబార్డు నిధులను వినియోగించుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నాబార్డు ఏజీఎం స్వాతి తివాని సూచించారు. మండలంలోని రంగాపూర్, తాడ్వాయి మండలంలోని మేడారం, నార్లాపూర్ గ్రామాల్లో నాబార్డు అధికారులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులకు పండ్ల తోటల పెంపకంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే గిరిజనుల జీవనోపాధిలో భాగంగా తాడ్వాయి మండలంలోని కన్నెపల్లి గ్రామంలో టైలరింగ్, పాడి పశువుల యూనిట్లను ప్రారంభించారు. వన సమాఖ్య ఆధ్వర్యంలో మామిడితోటల పెంపకం, పచ్చళ్ల తయారీతో పాటు పలు పథకాలను నాబార్డు సంస్థ అందిస్తున్నదని, వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వన సమాఖ్య సీఈవో శ్రీనివాసులు, కోఆర్డినేటర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


మామిడితోటను పరిశీలిస్తున్న నాబార్డు బృందం

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మంగపేట, నవంబర్ 2 : మండలంలోని మల్లూరు శివారు కోడలు చెరువు మూలమలుపు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటాపురం మండలం బోదాపురం గ్రామానికి చెందిన దుర్ర స్వరూప (24) అనే మహిళ మృతి చెందగా, ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై రవికుమార్ కథనం మేరకు బోదాపురానికి చెందిన స్వరూప పినపాక మూలమల్లారంలోని తన తల్లిగారింటికి భర్త నవీన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బుధవారం సాయంత్రం బయలు దేరారు. మండలంలోని తిమ్మంపేట క్రాస్ దాటాక కోడలు చెరువు మూల మలుపు వద్ద అదుపు తప్పిన వీరి ద్విచక్ర వాహనం రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టడంతో స్వరూప సమీపంలోని నీటి కాలువలో పడిపోయి బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా ఆమె భర్త నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలి తండ్రి కొడిపె శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడు..

మంగపేట నవంబర్ 2 : మండలంలోని మల్లూరుకు చెందిన వట్టం మనోజ్ (15) అనే ఇంటర్మీడియట్ విద్యార్థి గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మనోజ్ ఏటూరునాగారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. మల్లూరుకు చెందిన ఓ వ్యక్తితో కలిసి ట్రాక్టర్‌పై నర్సింహసాగర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో శనగకుంట బ్రిడ్జి వద్ద ట్రాక్టర్ ట్రాలీలో కూర్చున్న మనోజ్ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఈ క్రమంలో ట్రాలీ టైరు మనోజ్ పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడగా, అదే ట్రాక్టర్‌లో మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.